



ప్రత్యేక బాక్స్‌లో ఊపిరితిత్తులను హైదరాబాద్‌కు తరలిస్తున్న వైద్యులు





ప్రాణలత

- బ్రెయిన్ డెడ్ మహిళ నుంచి అవయవదానం
- నలుగురికి పునర్జన్మనిచ్చిన పావనిలత
- విజయవాడ, హైదరాబాద్‌కు లివర్, ఊపిరితిత్తులు తరలింపు
- జీజీహెచ్, కిమ్స్‌కు రెండు కిడ్నీలు, ఐబ్యాంక్‌కు నేత్రాలు
- కర్నూలు సర్వజన ఆసుపత్రిలో అరుదైన ఘటన

నగరంలో గ్రీన్‌చానల్



మంగళవారం మధ్యాహ్నం తర్వాత కర్నూలు నగరం ఒక్కసారిగా స్తంభించింది. ఎక్కడి వాహనాలు అక్కడే. ట్రాఫిక్ మొత్తం క్లియర్. జాతీయ రహదారి వెంట వాహనాల రాకపోకలు నిలిపివేత. ప్రధానమంత్రి, రాష్ట్రపతి పర్యటనకు మించిన వాతావరణం కనిపించింది. కర్నూలు సర్వజన ఆసుపత్రి మొదలుకుని హైదరాబాద్‌తో పాటు విజయవాడకు వెళ్లే ప్రతి రహదారినీ పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. మొత్తం పోలీస్ యంత్రాంగం బారులుదీరి ఎక్కడికక్కడ ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఎక్కడా ఒక్క వాహనం కూడా అడ్డు లేకుండా చూశారు. అసలు నగరంలో ఏమి జరుగుతోందో ప్రజలకు తెలియడం లేదు. అందరిలోనూ ఒకే ఉత్కంఠ. రోడ్డు వెంబడి ఉన్న నగరవాసుల్లో ఒకే టెన్షన్. మరో వైపు కర్నూలు సర్వజన ఆసుపత్రిలోని బ్లాక్ ఎదుట ఆగిన అంబులెన్సుల్లో ఆకుపచ్చని దుస్తుల్లో ఉన్న వైద్యులు ఒక్కో పెట్టెతో ఒక్కో అంబులెన్స్‌లోకి పరుగులు తీశారు. మూడు అంబులెన్స్‌లు.. దాని వెనుక పోలీసు వాహనాలు వాయువేగంతో దూసుకెళ్లాయి. గ్రీన్ చానల్ ద్వారా ఒక యుద్ధంలా సాగిన ప్రాణదాన యజ్ఞం ఇది. అంపశయ్యపై అల్లాడుతున్న బతుకులకు అవయవదానం చేసి పునర్జన్మనిచ్చేందుకు ఓ వారధి నిర్మాణంలో పోలీసులు కీలకభూమిక పోషించారు.



అవయవాలను సేకరిస్తున్న డాక్టర్లు

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 6: అనారోగ్యంతో బ్రెయిన్ డెడ్ అయిన ఓ మహిళ అవయవదానం చేసి నలుగురికి పునర్జన్మను ప్రసాదించింది. ఊపిరితిత్తులు, కాలేయం, కిడ్నీ, కళ్లను దానం చేసి మరణించాక కూడా తన మానవత్వాన్ని చాటుకుంది. ఆమె కుటుంబ సభ్యులు అంగీకరించడంతో అవయవదానం చేసిన కాలేయం, ఊపిరితిత్తులను పోలీసులు ఏర్పాటు చేసిన గ్రీన్ చానల్ ద్వారా అవయవాలను విజయవాడకు తరలించారు. దీంతో కర్నూలులో మొట్టమొదటిసారిగా బ్రెయిన్‌డెడ్ మహిళ నుంచి అవయవాలను సేకరించి ఇతర ప్రాంతాలకు తరలించారు. కర్నూలు నగరంలోని బాలాజీనగర్‌కు చెందిన వీరప్రతాప్‌రెడ్డికి ముగ్గురు సంతానం. రెండో కుమార్తె పావనిలతకు తెలంగాణ రాష్ట్రం కొల్లాపూర్‌లోని నరసరావుపల్లికి చెందిన శ్రీనివాసరెడ్డితో 8 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఆరేళ్ల జ్యోష్న అనే బాలిక సంతానం. రెండున్నరేళ్ల క్రితం భర్త కిడ్నీ సంబంధిత వ్యాధితో మృతి చెందాడు. భర్తను కోల్పోయిన పావనిలత ఉద్యోగం కోసం కొద్దిరోజుల క్రితం హైదరాబాదుకు వెళ్లింది. అక్కడ ఫిట్స్ రావడంతో స్థానికులు ఓ ఆసుపత్రిలో చేర్పించారు. ఆరోగ్యం విషమించడంతో ఆమెను తల్లిదండ్రులు ఈ నెల 3న వెంటిలేటర్‌పై కర్నూలు జీజీహెచ్‌కు తీసుకుని వచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 5వ తేదీన ఆసుపత్రి వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ చింతా ప్రభాకర్ రెడ్డి, జీవన్‌దాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోఆర్డినేటర్ సురేష్ కుమార్, హర్షద్, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గోవిందరెడ్డిలు అవయవాల సేకరణ కోసం పావని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారు అంగీకరించ డంతో మంగళవారం కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని గుండె, ఊపిరితిత్తుల విభాగంలో వైద్యులు అవయవాలను సేకరించారు.

అవయవాలు ఎవరెవరికి..

- హైదరాబాదు కిమ్స్ హాస్పిటల్‌లో ఓ రోగికి ఊపిరితిత్తులను తరలించారు.
- విజయవాడలోని మణిపాల్ హాస్పిటల్‌లోని ఓ రోగికి కాలేయాన్ని తరలించారు.
- కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని ఓ రోగికి కిడ్నీ
- కర్నూలు కిమ్స్ హాస్పిటల్‌లోని బాధితుడికి మరో కిడ్నీ
- రెండు నేత్రాలను కర్నూలు రెడ్‌క్రాస్ ఐ బ్యాంకుకు తరలించారు.

ఆగమేఘాలపై అవయవాల తరలింపు

బ్రెయిన్‌డెడ్ అయిన పావనిలత నుంచి ఊపిరితిత్తులు, కిడ్నీ, కాలేయం అవయవాలను తరలించడానికి పోలీసులు ప్రత్యేక గ్రీన్ చానల్‌ను ఏర్పాటు చేశారు. కర్నూలు మెడికల్ కాలేజీ నుంచి గుత్తి పెట్రోల్ బంకు హైవే వరకు ప్రత్యేక పోలీసులను ఏర్పాటు చేసి అవయవాల తరలింపులో ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6:30 గంటల తర్వాత ట్రాఫిక్‌ను మళ్లించారు. దీంతో ఊపిరితిత్తులు, కాలేయ అవయవాలను ప్రత్యేక అంబులెన్సుల్లో గుత్తి పెట్రోల్ బంకు మీదుగా విజయవాడ, హైదరాబాదుకు తరలించారు. ఓ కిడ్నీని నగరంలోని కిమ్స్ ఆసుపత్రికి చేరవేశారు. మరో కిడ్నీని కర్నూలు జీజీహెచ్‌లో ఓ వ్యక్తికి అమర్చి శస్త్రచికిత్స చేశారు.



పావనిలత కుటుంబ సభ్యులతో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్



హైవేపై స్తంభించిన వాహనాలు

కాలేయాన్ని విజయవాడకు తరలిస్తూ...

అంబులెన్స్‌లో కిడ్నీ ఉన్న బాక్సు

ఎందుకింత పరుగు?

అవయవాన్ని దాత నుంచి సేకరించిన కొన్ని గంటల వ్యవధిలోనే గ్రహీతకు అమర్చాల్సి ఉంటుంది. గుండెను నాలుగు నుంచి ఆరు గంటల్లోపు అమర్చాలి. అదే ఊపిరితిత్తులు అయితే 4-8 గంటల్లోపు అమర్చాలి. ఇక కిడ్నీలకు 24-48 గంటల సమయం తీసుకోవచ్చు. లివర్ 12-15 గంటల్లోను, ప్రాంకియాస్ 12-24 గంటల వ్యవధిలో గ్రహీతకు అమర్చాలి. లేకపోతే విలువైన అవయవాలు ఉపయోగపడకుండా పోతాయి. అందుకే ప్రతి క్షణాన్నీ విలువైనదిగా పరిగణించి పరుగులు పెడతారు. దాత నుంచి గ్రహీత వరకు ఒక్క నిమిషం కూడా వృథా కాకుండా మొత్తం గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేస్తారు.

కర్నూలు జీజీహెచ్‌లో మొట్టమొదటి అవయవదానం



మాట్లాడుతున్న కలెక్టర్, ఆసుపత్రి డాక్టర్లు

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో బ్రెయిన్‌డెడ్ అయిన మహిళ నుంచి మొదటిసారిగా అవయవాలను సేకరించినట్లు కర్నూలు కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. మంగళవారం కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని సిటీవీఎస్ విభాగంలో కలెక్టర్‌తో పాటు సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. జీవన్‌ధాన్‌లో రిజిస్టర్ చేసుకున్న వారి అవసరాల మేరకు పావనీలతకు సంబంధించిన అవయవాలను గ్రహీతలకు చేరవేసినట్లు తెలిపారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ వి.వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ అవయవదానం ఏర్పాట్లు ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఏర్పాటు చేశామన్నారు. మానవ శరీరంలోని అవయవాలను దాదాపు 8 మందికి ఉపయోగించుకోవచ్చన్నారు. వీటిలో చిన్నప్రేగులు, పెద్ద పేగులు, క్లోమం ఇతర భాగాలను కూడా వినియోగించుకోవచ్చని తెలిపారు. కొందరు మూఢనమ్మకాల కారణంగా అవయవదానం చేయడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ పి.సుధాకర్, రెడ్‌క్రాస్ కమిటీ జిల్లా చైర్మన్ కేజీ గోవిందరెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్లు వెంకటతులసమ్మ, జీవన్‌దాన్ ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేటర్లు సురేష్ కుమార్, హర్షద్, సంపత్ పాల్గొన్నారు.

ఈవీఎం బాక్స్‌లకు గదుల పరిశీలన



స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

నంద్యాల క్రైం/పాణ్యం, ఫిబ్రవరి 6: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటింగ్ అనంతరం జిల్లాలోని పార్లమెంట్, ఏడు నియోజకవర్గాల కేంద్రాలకు సంబంధించి ఈవీఎం బాక్స్‌లను భద్రపరచేందుకు అవసరమైన గదులను జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. శాంతిరాం, ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల, వేర్‌హౌస్‌లలోని గదులను వారు పరిశీలించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు స్ట్రాంగ్ రూం కేంద్రాలను సిద్ధం చేయాలని వివిధ శాఖల అధికారులకు కలెక్టర్, ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. పరిశీలనలో డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి, ఎస్బీ డీఎస్పీ సంతోష్, ఆర్డీఓ మల్లికార్జునరెడ్డి, డీఎస్ఓ వెంకటరాముడు, తహసీల్దారు ఫణికుమార్, ఆర్జీఎం కళాశాల డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టైగర్ ప్రాజెక్టులో 90 దాకా పెద్ద పులులు

ఎఫ్‌డీపీటీ బీఎన్ఎన్ మూర్తి

రుద్రవరం, ఫిబ్రవరి 6 : నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ ప్రాజెక్టులో ఈ ఐదేళ్లలో ఒక్కసారిగా 80 నుంచి 90 దాకా పెద్దపులుల సంఖ్య పెరిగిందని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు, ఫీల్డ్ డైరెక్టరు ప్రాజెక్టు టైగర్, నంద్యాల సర్కిల్ ఇన్‌చార్జ్ బీఎన్ఎన్ మూర్తి అన్నారు. మంగళవారం ఆయన రుద్రవరంలో మాట్లాడుతూ గతంలో 50 నుంచి 60 పెద్ద పులులు ఉండేవని, ఇప్పుడు పెద్దపులుల సంఖ్య బాగా పెరిగిందని అన్నారు. ఈ టైగర్ ప్రాజెక్టు భారతదేశంలోనే విశాలమైనదని, ఏపీలోని నంద్యాల, ప్రకాశం, పల్నాడు, గుంటూరు జిల్లాల్లో, తెలంగాణలోని నల్గొండ జిల్లాలో విస్తరించి ఉందని అన్నారు. ఇందులో పెద్దపులులు కడప, అన్నమయ్య, తిరుపతి వరకు సంచరిస్తున్నాయన్నారు. ఇటు నల్లమల, లంకమల, శేషాచలం అడవుల వరకూ పెద్దపులుల సంచారం ఉందన్నారు. వీటిని కారిడార్‌గా ఏర్పాటు చేస్తున్నామన్నారు. అడవిలో జంతువులను వేటాడకుండా 80 యాంటీ ప్రోచర్ క్యాంపులను ఏర్పాటు చేశామన్నారు. పెద్దపులి రెండున్నర- మూడు సంవత్సరాల వయసు రాగానే తనకు ప్రత్యేక టెరిటోరియం ఏర్పాటు చేసుకుంటుందన్నారు. ప్రజలు, ప్రభుత్వం సహకారంతో పెద్దపులుల సంరక్షణ చేపడుతున్నామన్నారు.



రుద్రవరం కలప డిపోను పరిశీలిస్తున్న దృశ్యం

సైకిల్ ఎక్కనున్న బైరెడ్డి

- టీడీపీలో చేరేందుకు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సిద్ధం
- ఈ నెల 7 తర్వాత ముహూర్తం ఖరారు
- బైరెడ్డి కుమార్తె శబరికి ఎంపీ టికెట్?
- ఎమ్మెల్యే టికెట్‌నూ ఆశిస్తున్న రాజశేఖర్ రెడ్డి

నంద్యాల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి)/నందికొట్కూరు: మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నాయకుడు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి సైకిల్ ఎక్కేందుకు సిద్ధమయ్యాడు. త్వరలోనే చంద్రబాబును కలిసి పార్టీలో ఆయన చేరనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఉమ్మడి కర్నూలు జిల్లాలో బైరెడ్డి రాజశేఖరరెడ్డికి సుదీర్ఘ రాజకీయానుభవం ఉన్న నాయకుడిగానే కాకుండా, బలమైన నేతగా పేరుంది. మొదట్లో టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన బైరెడ్డి, 2009 అనంతర పరిణామాలతో పార్టీని వీడారు. ఆ తర్వాత ప్రత్యేక రాయలసీమ వాదాన్ని తనదైన శైలిలో బలంగా వినిపించారు. అయితే ప్రస్తుతం ఆయన మళ్లీ సాధారణ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. తాను రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టిన టీడీపీ నుంచే టికెట్ ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే దాదాపు ఆ పార్టీ పెద్దలతో చర్చలు పూర్తయ్యాయని, ఆయన ఇంట్లో ఒకరికి ఎంపీ టికెట్ ఖాయమైందని సమాచారం. అయితే బైరెడ్డి మాత్రం నంద్యాల ఎంపీ టికెట్‌తో పాటు, ఒక ఎమ్మెల్యే టికెట్ కూడా ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి బైరెడ్డి చేరిక జిల్లాలో టీడీపీకి కొత్త ఊపు తీసుకురానుండగా, నందికొట్కూరు, పాణ్యం నియోజకవర్గాల్లో బలం పెరగనుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డితో వైసీపీకి చెక్

బైరెడ్డి రాజశేఖరరెడ్డి స్థానిక నేత కావడంతో నందికొట్కూరులో ఆయనకు మంచి పట్టు ఉంది. అయితే చాలాకాలంగా ఆయన ఏ పార్టీలో ఉండకుండా స్వతంత్రంగా కొనసాగుతున్నారు. మరోవైపు ఆయన తమ్ముడి కుమారుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి గత ఎన్నికలకు ముందు వైసీపీలో చేరి స్థానికంగా కేడర్‌ను ఏర్పరుచుకున్నాడు. 2019 ఎన్నికల్లో ఆర్థర్ గెలుపుకు సిద్ధార్థ అంశం బాగానే కలిసివచ్చింది. ఓ రకంగా ఇక్కడ వైసీపీదే కాస్త పై చేయిగా కనిపిస్తోంది. ఈ పరిస్థితిని మార్చేందుకు టీడీపీ బాగానే కసరత్తు చేస్తోంది. మరోవైపు పాణ్యం నియోజకవర్గంలో బలమైన నాయకుడిగా ఉన్న వైసీపీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని సమర్థంగా ఎదుర్కొనేందుకు టీడీపీ యోచన చేస్తోంది. బైరెడ్డిని చేర్చుకోవడం ద్వారా నందికొట్కూరు నియోజకరవ్గంతో పాటు, ఈ నియోజకవర్గ సెటిలర్లు అధికంగా ఉండే కర్నూలులోని పలువార్డుల ఓట్లను టీడీపీ వైపు మళ్లించుకోవడమే కాకుండా, పాణ్యం నియోజకవర్గంలో కూడా బాగానే ప్రభావం చూపవచ్చన అభిప్రాయంలో టీడీపీ ఉంది.





ఎంపీ ఓకే.. ఎమ్మెల్యే టికెట్‌పైనే డౌట్!

బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సొంత గ్రామం నందికొట్కూరు నియోజకవర్గంలోని పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామం. ఆయన తండ్రి శేషశయనారెడ్డి నందికొట్కూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పలుమార్లు గెలిచారు. తండ్రి రాజకీయాన్ని అందిపుచ్చుకున్న రాజశేఖరరెడ్డి అదే నియోజకవర్గం నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తర్వాత నందికొట్కూరు ఎస్సీ రిజర్వుడుగా మారడంతో 2009లో పాణ్యం నుంచి బరిలోనికి దిగి ఓడిపోయారు. ఈ రెండు నియోజకవర్గాల్లో బైరెడ్డికి మంచి పట్టుంది. తన చేరిక పార్టీకి బలం పెరుగుతుంది కాబట్టి తన కుటుంబానికి ఓ ఎంపీ టికెట్, ఓ ఎమ్మెల్యే టికెట్ కావాలని బైరెడ్డి టీడీపీ పెద్దలను పట్టుబట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఎంపీ టికెట్ వరకు టీడీపీ సరే అన్నట్లు తెలుస్తోంది. అది కూడా రాజశేఖరరెడ్డి కుమార్తె బైరెడ్డి శబరికి అయితేనే ఓకే అన్నట్లు సమాచారం. చివరకు టీడీపీ, రాజశేఖరరెడ్డి మధ్య అవగాహన వచ్చిందని, ఇక ఆయన పార్టీలో చేరిక లాంఛనమేనన్న అభిప్రాయం పార్టీ వర్గాల నుంచి వినిపిస్తోంది. టీడీపీలో చేరిన తర్వాత కర్నూలులో భారీ బహిరంగ సభను బైరెడ్డి ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. ఆయన మొదటిసారి ఎన్టీఆర్ సమక్షంలో టీడీపీలో చేరినపుడు కూడా ఇదే విధంగా చేశారు. ప్రస్తుతం కూడా అదే విధానాన్ని పాటించబోతున్నట్లు సమాచారం.

రెండు దశాబ్దాలుగా టీడీపీకి దక్కని నందికొట్కూరు

1994, 1999లలో జరిగిన ఎన్నికల్లో నందికొట్కూరు నుంచి బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి రెండు పర్యాయాలు విజయం సాధించారు. ఆ తర్వాత 2004లో కాంగ్రెస్ చేతిలో టీడీపీ ఓటమిపాలైంది. ఆ తర్వాత ఎస్సీ రిజర్వుడుగా మారినా టీడీపీ అభ్యర్థులను అదృష్టం వరించలేదు. మొత్తం మీద నందికొట్కూరుపై టీడీపీ జెండాను ఎగురవేసేందుకు 20 ఏళ్లుగా పార్టీ కేడర్ ఎదురుచూస్తోంది. 2024 ఎన్నికల్లో ఎలాగైనా విజయకేతనం ఎగురవేయాలనే ఆలోచనతో టీడీపీ అధిష్టానం వ్యూహరచన చేస్తోంది. ఇప్పటికే నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి నియోజకవర్గంలో టీడీపీని బలోపేతం చేశారు. ఇక మాండ్రతో పాటు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, గౌరు వెంకటరెడ్డి, గౌరు చరిత కలసికట్టుగా కృషి చేస్తే టీడీపీ విజయం నల్లేరుపై నడకగా మారనుంది.



నందికొట్కూరులో ఏర్పాటైన ఫ్లెక్సీలు

నందికొట్కూరులో 'సిద్ధమా..'

నందికొట్కూరు ఫిబ్రవరి 6: నందికొట్కూరులో రాజకీయం వేడెక్కుతోంది. 2024 సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం అంటూ పట్టణంలో వైసీపీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసింది. మేము వెయ్యిరెట్లు సిద్ధం అంటూ టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఉన్న ఫ్లెక్సీలు పట్టణంలో వెలిశాయి. దీంతో ఈ ఫ్లెక్సీల ఏర్పాటు నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారింది. దీంతో బైరెడ్డి టీడీపీలో చేరికకు ఈ ఫ్లెక్సీలు మరింత ఊతమిచ్చాయి.



చర్చనీయాంశంగా మారిన బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఎన్టీఆర్ ఫొటోలతో కూడిన ఫ్లెక్సీ

భూములివ్వం

- గ్రామ సభ రసాభాస
- తెల్ల కాయితం మీద సంతకాలు చేయించుకున్నారని ఆరోపణ
- సోలార్ పరిశ్రమకు భూములివ్వమని ఏకగ్రీవ తీర్మానం

ప్రాణాలైనా ఇస్తాం...

ఓర్వకల్లు, ఫిబ్రవరి 6: సోలార్ పరిశ్రమకు భూములు ఇచ్చే ప్రసక్తే లేదని.. ప్రాణాలైనా అర్పిస్తాంగాని పంట పొలాలు వదులుకోమని రైతులు గ్రామ సభలో తెగేసి చెప్పారు. మంగళవారం మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో సోలార్ పవర్ ప్లాంటు వద్దని గ్రామసభలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. రైతులకు మద్దతుగా ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, నాయకుడు నాగన్న మద్దతు తెలిపారు. గ్రామంలోని సచివాలయం ఎదుట జరిగిన ఈ సమావేశానికి గ్రామ సర్పంచ్ శకుంతలమ్మ అధ్యక్షత వహించారు. ఈ సభకు గ్రామ పంచాయతీ అధికారి శ్రీలత, వీఆర్వో మధుసూదన్, ఎంపీటీసీ సరోజమ్మ హాజరై సభను ప్రారంభించారు. సభ ప్రారంభం కాగానే పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సోలార్ ప్లాంటు వద్దు.. మా భూములు కాపాడండని నినాదాలు చేశారు. అనంతరం సర్పంచ్ శకుంతలమ్మను మహిళలు దురుసుగా మాట్లాడటంతో గ్రామ సభ రసాభాసగా మారింది. దీంతో సర్పంచుకు, రైతులకు మధ్య వాదోపవాదాలు జరిగాయి. గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీలత స్పందిస్తూ సోలార్ పవర్ ప్లాంటును వ్యతిరేకిస్తూ రైతులు చేసిన విజ్ఞప్తికి స్పందించి గ్రామంలో సోలార్ ప్లాంటు అవసరం లేదని, గ్రామ సభ ద్వారా ఏకగ్రీవంగా తీర్మానించినట్లు అజెండా చదివి వినిపించారు. ఈ సభలో సుమారు 400 మంది రైతులు, ప్రజల సంతకాలను సేకరించారు. సోలార్ నిర్మాణానికి వ్యతిరేకిస్తూ తీర్మానాన్ని ఆమోదించారు. సర్పంచ్ శకుంతలమ్మ మాట్లాడుతూ సోలార్ అధికారులు సాగుకు ఉపయోగపడని ప్రభుత్వ భూమి మాత్రమే సోలార్ పరిశ్రమకు తీసుకుంటామని చెప్పి ఖాళీ పేపరుపై సంతకాలు తీసుకుని వెళ్లారని, అయితే.. రైతులు సోలార్ పరిశ్రమకు భూములు ఇచ్చే ప్రసక్తే లేదని ఏకగ్రీవ తీర్మానం గ్రామసభలో చెప్పారు. పంచాయతీ కార్యదర్శి శ్రీలత మాట్లాడుతూ గ్రామ సభలో సర్పంచు ఆధ్వర్యంలో రైతుల అభిప్రాయం మేరకు గ్రామ సభలో ఏకగ్రీవ తీర్మానం చేశామని, దీన్ని ఉన్నతాధికారులకు పంపించామని ఆమె తెలిపారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడుతూ గ్రామంలో సోలార్ ప్లాంటు నిర్మాణం చేపడుతున్నట్లు క్యాబినెట్ తీర్మానం చేయడంతో రైతులు తీవ్ర ఆందోళన చెంది ధర్నాలు చేపట్టారని అన్నారు. భూముల్లో వందలాది మంది రైతులు మామిడి తోటలు, పూల తోటలు, వివిధ రకాల



ఉయ్యాలవాడలో సర్పంచుతో వాగ్వివాదం చేస్తున్న రైతులు

పంటలు సాగు చేస్తున్నారని అన్నారు. ఈ భూముల్లో బోరు బావులు ఉన్నాయని, మండలంలో డీఆర్‌డీవో, సోలార్, విమానాశ్రయం, ఉక్కు పరిశ్రమలతో పశువులకు మేత లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అయితే పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా స్థానికేతరులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం సరికాదన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో గ్రామ సభల్లో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం.. గ్రామాభివృద్ధికి మౌలిక సదుపాయాలు కల్పిస్తామంటూ పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని వీటన్నింటినీ విస్మరిస్తున్నారన్నారు.

ప్రాణాలైనా అర్పిస్తాం.. భూములు ఇచ్చే ప్రసక్తే లేదు

మా ప్రాణాలైనా అర్పిస్తాం.. సోలార్ పరిశ్రమకు భూములు ఇచ్చే ప్రసక్తే లేదు. గత రెండు రోజులుగా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉయ్యాలవాడలోని సచివాలయం ఎదురుగా నిరసన కార్యక్రమాలు చేపట్టాం. పోరాడి మా భూములు మేము దక్కించుకుంటాం.

\- బోయ ఎల్ల రాముడు, రైతు

పరిశ్రమ వద్దే వద్దు

ఉయ్యాలవాడ గ్రామంలో సోలార్ పరిశ్రమ ఏర్పాటు చేయవద్దు. పరిశ్రమల వల్ల ఉన్న భూములు కోల్పోవాల్సి వస్తుంది. పశువులకు గొర్రెలకు మేత లేని పరిస్థితి ఏర్పడుతుంది. సోలార్ పరిశ్రమ ఏర్పాటైతే.. కుటుంబాలు రోడ్డున పడాల్సి వస్తుంది. సోలార్‌కు భూములు ఇచ్చే ప్రసక్తే లేదు.

\- మహబూబ్ బాషా, రైతు

ఆత్మహత్యలే శరణ్యం

గ్రామంలో పరిశ్రమ ఏర్పాటు చేయడానికి వీల్లేదు. రైతులను చంపేసి పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాల్సిందే. పరిశ్రమ వల్ల సారవంతమైన భూములను కోల్పోవాల్సి వస్తుంది. మొండిగా పరిశ్రమలు చేస్తామంటే ఆత్మహత్య చేసుకుంటాం.

\- మొల్ల అల్లికేర్, రైతు



సంతకాలు చేస్తున్న రైతులు

శ్రీశైలంలో తెలంగాణ మద్యం

భారీగా పట్టుపడ్డ బాటిళ్లు



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

శ్రీశైలం, ఫిబ్రవరి 6: శ్రీశైలంలో గత నాలుగు రోజులుగా పోలీసులు జరిపిన తనిఖీల్లో భారీగా తెలంగాణ మద్యం పట్టుబడింది. తెలంగాణ రాష్ట్రం మున్ననూరుకు చెందిన ఓ మహిళ క్షేత్ర పరిధిలో మద్యం విక్రయిస్తుందనే సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో దాదాపు 166 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై సీఐ ప్రసాదరావు మాట్లాడుతూ క్షేత్రపరిధిలో మద్యం, మాంసం నిషేధం ఉన్నప్పటికీ కొందరు వాటిని గుట్టుచప్పుడుగా విక్రయిస్తున్నారన్నారని అన్నారు. అక్రమ మద్యంపై నిఘా పెంచామని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ప్రసాదరావు హెచ్చరించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

అక్రమ వ్యాపారం చేస్తున్న అధికార పార్టీ నాయకులు

కోసిగి, ఫిబ్రవరి 6: మండలంలోని తుమ్మిగనూరు గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు గుడికల్లు హుశేనీ, హనుమేష్ అనే వ్యక్తులు తుంగభద్ర నదిని దాటి 13 అక్రమ కర్ణాటక మద్యం బాక్సులు తీసుకువస్తుండగా.. కోసిగి సెబ్ సీఐ మహబూబ్‌బాషా, ఎస్ఐ రమేష్‌బాబు మంగళవారం దాడి చేసి 1248 టెట్రా ప్యాకెట్లు, 90 ఎంఎల్ ఒరిజినల్ చాయిస్ మద్యం స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.51వేల విలువ ఉంటుందని వారు తెలిపారు. తుమ్మిగనూరు తుంగభద్ర నదితీరంలో ఉండటంతో కళ్లు గప్పి పారిపోయినట్లు సెబ్ పోలీసులు తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అక్రమంగా అధికార పార్టీ నాయకులు కర్ణాటక మద్యాన్ని సరఫరా చేసి డంపు ఏర్పాట్లు చేస్తున్నట్లు గ్రామాల్లో చర్చ జరుగుతుంది. నిందితులను అరెస్టు చేస్తామని సెబ్ పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో సెబ్ పోలీసులు రాయుడు, నాగరాజు, మధు, నాగరాజు పాల్గొన్నారు.

మహిళ బలవన్మరణం

వెల్దుర్తి, ఫిబ్రవరి 6: మండలంలో బింగిదొడ్డి గ్రామానికి చెందిన బోయ వెంకటేశ్వరమ్మ(25) అనే మహిళ మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది. ఉదయం ఇంట్లో ఎవరులేని సమయంలో ఇంటి పైకప్పు దెంతలకు చీర కట్టుకొని ఉరి వేసుకుంది. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. విషయం తెలుసుకున్న స్థలాన్ని ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం వెల్దుర్తి సీహెచ్‌సీ ఆసుపత్రికి తరలించారు. మృతిచెందడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టిన బీటీ నాయుడు

శాసన మండలిలో ఉపనాయకుడిగా ఎదురుదాడి



కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 6: ఈ ఐదేళ్లలో జగన్ ప్రభుత్వ వైఫల్యాలను శాసన మండలి ఉపనాయకుడు బీటీ నాయుడు సమావేశాల్లో ఎత్తిచూపారు. మంగళవారం శాసన మండలి సమావేశాల్లో 2వ రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే అంశంపై ఆయన సుదీర్ఘంగా మాట్లాడుతూ ప్రభుత్వాన్ని ఎండగట్టారు. నాలుగేళ్ల బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో అబద్ధాలు పలకలేక గవర్నర్ నీళ్లు తాగారన్నారు. గడిచిన నాలుగు సంవత్సరాల కాలంలో 5 కోట్ల మంది ప్రజలకు రాజధాని లేదని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి పోలవరం ప్రాజెక్టుని ఏం చేశారని ప్రశ్నించారు. వీటి గురించి గవర్నర్ ప్రసంగంలో ప్రస్తావనే లేదని, మెగా డీఎస్సీ, డీఎస్సీలేక పోవడం వల్ల వేలాది మంది విద్యార్థులు రోడ్డు పాలయ్యారని గుర్తు చేశారు.

బీఈడీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 6: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో అక్టోబరు 2023లో జరిగిన బీఈడీ ప్రథమ సెమిస్టర్ ఫలితాలను పరీక్షల విభాగం కంట్రోలర్ విడుదల చేశారు. మంగళవారం ఉదయం ఉపకులపతి చాంబర్‌లో విడుదల చేసిన ఫలితాలను వెబ్‌సైట్‌లో ఉంచారు. రెగ్యులర్ విభాగంలో 2,827 మందికి గాను 1,477 మంది ఉత్తీర్ణత సాధించారు. సప్లిమెంటరీ విభాగంలో 813 మందికి 357 మంది ఉత్తీర్ణత సాధించినట్లు వర్సిటీ అధికారులు వెల్లడించారు.

నులిపురుగుల నివారణ దినాన్ని పాటించండి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 6: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈ నెల 9వ తేదీన జాతీయ నులి పురుగుల నివారణ దినాన్ని విజయవంతం చేయాలని డీఈవో శ్యామేల్‌పాల్ మంగళవారం తెలిపారు. పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ నులిపురుగుల మందును వేయించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డీఈవో తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు డీఈవో కార్యాలయానికి పంపాలని సూచించారు.

సబ్ జైలును సందర్శించిన న్యాయాధికారి



ఖైదీల వివరాలను అడిగి తెలుసుకుంటున్న జిల్లా న్యాయాధికారి

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 6: పత్తికొండ పట్టణంలో మంగళవారం జిల్లా న్యాయాధికారి ఎన్.శ్రీనివాసరావు పత్తికొండ సబ్ జైలును, ప్రభుత్వ ఆసుపత్రులను సందర్శించారు. సబ్ జైలును సందర్శించిన జిల్లా న్యాయాధికారి శ్రీనివాసరావు ఖైదీల యోగక్షేమాలను, జైలులో స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఖైదీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. అలాగే పట్టణంలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్, అంజనేయ నగర్‌లో ఉన్న ఇంటర్ బాయ్స్ హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని విద్యార్థులకు ప్రభుత్వపరంగా అందుతున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం కూడిన రుచికరమైన భోజనాన్ని అందించాలని హాస్టల్ నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ చంద్రమోహన్, న్యాయవాదులు దామోదరాచారి, నగేష్, హాస్టల్స్ వార్డెన్లు తదితరులు ఉన్నారు.

మంచాలమ్మకు పంచామృతాభిషేకం

మంత్రాలయం, ఫిబ్రవరి 6: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మ దేవతకు విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. మంగళవారం విశేష మాఘమాసం ఏకాదశి శుభ సందర్భాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో పండితులు, అర్చకులు ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, కుంకుమ సేవ, విశేష పంచామృతాభిషేకం చేసి పట్టుచీర, బంగారు, వెండి ఆభరణాలుతో పాటు వివిధ రకాల పుష్పాలు, ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



అలంకరణలో మంచాలమ్మ దేవత

శ్రీమఠంలో నిజ బృందావన దర్శనం

మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో స్వామి నిజ బృందావనాన్ని భక్తులు దర్శించుకున్నారు. మంగళవారం ఏకాదశి సందర్భంగా బృందావనానికి నిత్యం జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు రద్దు చేశారు. అర్చకులు బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం నిర్వహించి పూజలు చేశారు.

టీడీపీలోనే బీసీలకు పెద్దపీట

- వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయి
- 'జయహో బీసీ'లో గౌరు చరిత

కల్లూరు, ఫిబ్రవరి 6: తెలుగుదేశం పార్టీ బీసీలకు పెద్దపీట వేసి వారిని సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ఉన్నతస్థానాల్లో నిలిపిందని పాణ్యం టీడీపీ ఇన్‌చార్జ్ గౌరుచరిత పేర్కొన్నారు. మంగళవారం పాణ్యం నియోజకవర్గంలోని చెన్నమ్మసర్కిల్లో గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి, నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో జయహోబీసీ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు, పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌరుచరిత మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలపై దాడులు, దౌర్జన్యాలు కేసులు అధికమయ్యాయన్నారు. బీసీలపై జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు జయహోబీసీకి పిలుపునిచ్చారని తెలిపారు. రాష్ట్రంలో వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయని, రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని ఆమె స్పష్టం చేశారు. గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతూ పాణ్యం నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేస్తున్న అవినీతి అక్రమాలకు చెక్ పెట్టే రోజులు వచ్చాయన్నారు. దూపాడులోని 139 సర్వేలో పేదలకు ఇచ్చిన ఇళ్లస్థలాల్లో జగనన్న ఇళ్ళు ఎందుకు కట్టించలేకపోయారో తెలపాలన్నారు. టీడీపీ జనసేన నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేసి చంద్రబాబును సీఎంగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెరుగు పురుషోత్తంరెడ్డి, కె.పార్వతమ్మ, నాగేశ్వరరావు యాదవ్, బెస్తమల్లికార్జున, వలసల రామకృష్ణ, శ్రీరాములు, మహానంది, అమర్‌నాథ్, మహేష్, తిరుపాల్‌బాబు, ధనుంజయ, కృష్ణయ్య, ఫిరోజ్, రామకృష్ణ, పవన్‌కుమార్, మాదేష్, డి.రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాణ్యం టీడీపీ ఇన్‌చార్జ్ గౌరుచరిత



పాల్గొన్న ప్రజలు

సహకార ఎన్నికలకు గుడ్‌బై చెప్పేశారు..

- రుణాల మంజూరులో ఇష్టారాజ్యం
- కమీషన్ల కోసం కక్కుర్తి

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 6: అన్నదాతలకు పొలాల అభివృద్ధి, పంటల సాగు కోసం రుణాలు మంజూరు చేసే కార్యక్రమాన్ని వాణిజ్య బ్యాంకుల కంటే మెరుగ్గా సహకార కేంద్ర బ్యాంకు పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు నిర్వహిస్తున్నాయి. ఈ సంఘాలకు పాలకవర్గాలను ఐదేళ్లకోసారి రైతులు ఎన్నుకుంటున్నారు. చివరిసారిగా రాష్ట్రంలో 2013లో ఈ సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. 2018తో ఈ పాలకవర్గం పదవీకాలం ముగిసినా వివిధ కారణాలతో ఎన్నికలు జరగలేదు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతులు పాలకవర్గాలను ఎన్నుకునే అవకాశాన్ని కల్పిస్తారనీ ఆశతో ఎదురు చూశారు. ఐదేళ్లు పూర్తి కావస్తున్నా జగన్ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించలేదు. పాలకవర్గాల నియామకాన్ని ఎమ్మెల్యేల సిఫారసుల ఆధారంగానే ఆరు నెలలకొకసారి నామినేట్ చేస్తూ వస్తుందే తప్పా శాశ్వత ప్రాతిపదికన ఎన్నికలను నిర్వహించలేకపోయింది. దీంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సహకార సంఘాలకు ఎన్నికలను నిర్వహించేందుకు రెండేళ్ల క్రిందట రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. ఇంతలో కొవిడ్ వ్యాప్తితో ఈ ప్రక్రియ కాస్త వెనక్కు వెళ్లిపోయింది. ఆ తర్వాత వైసీపీ శ్రేణులు రైతుల జాబితాను సేకరించి ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వంలోని కీలక నేతల సూచనల మేరకు కసరత్తు మొదలు పెట్టారు. అయితే ఎన్నికలకు వెళ్తే వ్యతిరేక ఫలితాలు వస్తాయన్న నిఘా వర్గాల హెచ్చరికలతో వెనక్కు తగ్గారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 99 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉండగా.. వాటిల్లో 6 లక్షల మంది రైతులు సభ్యులుగా చేరారు. వీరంతా ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో పంట రుణాలతో పాటు దీర్ఘకాలిక రుణాలను తీసుకుంటున్నారు.



కల్లూరు సహకార సంఘం కార్యాలయం

నీరుగారుతున్న సేవలు

సంఘాల్లో పారదర్శకత లోపిస్తోంది. సహకార రంగంలో వినూత్న మార్పులు వచ్చినా ఈ సంఘాల్లో మాత్రం ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం లేదని అధికారులే అభిప్రాయపడుతున్నారు. పాలకవర్గం ప్రతినిధులు రుణాల మంజూరులో చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నట్లు రైతుల నుంచి ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. మరోవైపు రుణాల స్వాహా తంతు యథేచ్ఛగా జరుగుతున్నట్లు ఫిర్యాదులు వెలువెత్తుతున్నాయి. అయినా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఉన్నతాధికారులు అధికార పార్టీలోని రాజకీయ నాయకుల ఒత్తిడితో వెనకడుగు వేస్తున్నారు. తాజాగా ప్రభుత్వం సహకార సంఘాల ఎన్నికలకు సంబంధించి ఎలాంటి ఊసెత్తకుండా ఇప్పటికే ఎమ్మెల్యేల సిఫారసుతో విధులు నిర్వహిస్తున్న త్రీమెన్ కమిటీలనే మరో ఆరు నెలలు పదవిలో ఉండేలా ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. దీనిపై రైతుల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన తర్వాతనే ఇక సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని, అప్పటి దాకా సహకార సంఘాల్లో జరుగుతున్న అవినీతి భాగోతంపై ఎవరూ నోరెత్తలేని పరిస్థితి దాపురించిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా విద్యాశాఖ అధికారిగా శ్యామేల్

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 6: కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారిగా శ్యామేల్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర పాఠశాలల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి ప్రవీణ్ ప్రకాష్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా డీఈఓగా పనిచేస్తున్న రంగారెడ్డి పదవీ విరమణ చేయడంతో పోస్ట్ ఖాళీ ఏర్పడింది. దీంతో స్టేట్ స్కూల్ ఎడ్యుకేషన్‌లో మోడల్ స్కూల్ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న శ్యామేల్‌ను రెగ్యులర్ డీఈఓగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

డిమాండ్లు నెరవేర్చాలి

● ఉద్యోగ సంఘాల జేఏసీ



ఆత్మకూరులో మాట్లాడుతున్న ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 6: ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ఏపీ ఎన్‌జీవో సంఘం తాలుకా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, కార్యదర్శి సాజిద్‌బాషా, ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కమతం శంకర్, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అచ్చయ్య కోరారు. మంగళవారం పెన్షనర్స్ అసోషియేషన్ కార్యాలయంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన జేఏసీ సమావేశంలో వారు మాట్లాడారు. 12వ పీఆర్‌సీ కమిటీ ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి ఐఆర్‌ను ప్రకటించాలని అన్నారు. అలాగే డీఏ, సరెండర్ లీవ్స్ బకాయిలతో పాటు జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ క్లెయిమ్స్ మెడికల్ బిల్లులను వెంటనే చెల్లించాలని చెప్పారు. అంతేకాకుండా సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తెలిపారు. లేనిపక్షంలో దశలవారిగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈనెల 11తేది నుంచి ఉద్యమ కార్యాచరణతో ముందుకు వెళ్లనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో ఏపీఎన్‌జీవో ఆత్మకూరు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



నందికొట్కూరులో మాట్లాడుతున్న రాముడు

నందికొట్కూరు: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో ఈనెల 13 నుంచి ఉద్యమబాట పట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామని నందికొట్కూరు తాలుకా ఏపీ జేఏసీ చైర్మన్ రాముడు అన్నారు. మంగళవారం నందికొట్కూరు ఏపీ ఎన్జీవో హోంలో నందికొట్కూరు తాలుకా ఏపీ జేఏసీ సమావేశం నిర్వహించారు. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, 12వ పీఆర్సీ కమిటీ ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి ఐఆర్ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. డీఏ, సరెండర్ లీవ్ బకాయిలను, జీపీఎఫ్‌లు, ఏపీజీఎల్ఐ క్లెయిమ్స్ మెడికల్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలన్నారు. ఈనెల 13 నుంచి ఉద్యమంలోకి ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికులు ఉద్యమబాట పట్టేందుకు వెనకాడబోమన్నారు. సమావేశంలో ఏపీ ఎన్జీవో కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యాయ సంఘం నాయకులు పీఆర్‌టీయూడీ జకీర్ హుస్సేన్, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నారాయణ, ఉపాధ్యక్షులు రాజశేఖర్, జాయింట్ సెక్రటరీ వెంకటలత, అనురాగ్ చెంచన్న, ప్రవీణ్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఓటర్లకు అందుబాటులో ఉండాలి: టీడీపీ



సమావేశంలో ఫరూక్, మల్లెల రాజశేఖర్

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 6: ఎన్నికల సమయంలో ఓటర్లకు అందుబాటులో ఉండాలని పొలిట్ బ్యూరో సభ్యుడు, టీడీపీ నంద్యాల ఇన్‌చార్జి ఎన్ఎండీ ఫరూక్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. నంద్యాలలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కొత్తగా వచ్చిన ఓటరు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి ప్రతి ఓటును పరిశీలించి ఓటర్లకు అందుబాటులో ఉండాలన్నారు. టీడీపీ సానుభూతిపరుల ఓట్లు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని, బూత్‌ల వారీగా ఓటర్లను గుర్తించి బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీతో అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చే సంక్షేమ పథకాలు ఓటర్లకు వివరించాల్సిన బాధ్యతపై దిశానిర్దేశం చేశారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

14న ఓంకారంలో వేలం పాట

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 6: మండలంలోని ఓంకార క్షేత్రంలో ఈనెల 14వ తేదీ ఉదయం 10 గంటలకు వివిధ రకాల అమ్మకాలకు, పాదరక్షల భద్రతకు సంబంధించిన బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఈవో నాగప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత మహాశివరాత్రి పర్వదినానికి ఐదు రోజులు ముందు నుంచి వచ్చే ఏడాది శివరాత్రి ఐదు రోజుల ముందు వరకు ఏడాది కాలాని వివిధ అమ్మకాల దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి వేలాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు రూ.10 వేలు ధరావత్తు చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వేలం పాట పూర్తి అయిన వెంటనే సదరు పాటదారుడు పూర్తి మొత్తం చెల్లించాల్సి ఉంటుందన్నారు. సరైన పాట లభించని ఎడల సదరు వేలం పాటను రద్దుపరిచే అధికారం దేవస్థానం అధికారులకు ఉంటుందని ఈవో తెలిపారు.

'యువత ఏదైనా సాధించొచ్చు'



మాట్లాడుతున్న ఫిరోజ్

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 6: యువత తలచుకుంటే ఏదైనా సాధించవచ్చని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. తొలిసారి ఓటు వేయనున్న యువతతో ముఖాముఖి కార్యక్రమాన్ని ప్రభాత్ కళాశాలలో నిర్వహించారు. ఫిరోజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో సరైన విద్య, ఉపాధి అవకాశాల్లేక యువత జీవితం అంధకారంలోకి వెళ్లడం దురదృష్టకరమన్నారు. ఉన్నత విద్యను అభ్యసించేందుకు సహకారం, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు టీడీపీతోనే సాధ్యమని గతంలో యువతకు టీడీపీ చేసిన వాటిపై ఆయన క్లుప్తంగా వివరించారు. టీడీపీ నాయకులు, కళాశాల యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

'దినసరి కూలి పెంచాలి'



కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 6: ఉపాధి హామీ కూలీలకు దినసరి కూలీ మొత్తాన్ని రోజుకు రూ.600 పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు డేవిడ్, రామచంద్రుడు, సుబ్బయ్య డిమాండ్ చేశారు. మంగళవారం వారు బండిఆత్మకూరులో కూలీలతో మాట్లాడుతూ నిర్దేశిత కొలతలు, నియమాలు పాటించాలన్నారు. ప్రభుత్వం పెరిగిన అన్ని రకాల ధరలను దృష్టిలో ఉంచుకుని కూలీ మొత్తం పెంచాలన్నారు. వేసవి సమీపిస్తోందని నీడ ఏర్పాటు చేసి, ప్రత్యేక అలవెన్సు ఇవ్వాలని కోరారు. కూలీలకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని, వారం వారం కూలీ అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

'రిజిస్టర్ల నిర్వహణ పకడ్బందీగా ఉండాలి'



సిబ్బందితో మాట్లాడుతున్న ఏడీఏ

పాములపాడు, ఫిబ్రవరి 6: మండలంలోని క్షేత్రస్థాయి గ్రామ సహాయకులు శాఖాపరంగా అమలవుతున్న పథకాలకు సంబంధించిన రిజిస్టర్ల నిర్వహణ సరిగా లేకపోతే చర్యలు తప్పవని ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు ఆంజనేయ హెచ్చరించారు. పాములపాడులోని మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో మంగళవారం మండల వ్యవసాయశాఖ అధికారి ఫణీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ క్షేత్రస్థాయి సిబ్బందికి వివిధ పథకాలపై డ్యాక్యుమెంటేషన్ మీద శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది ఏఈవోలు మద్దిలేటి, సాయి, ఎంపీవోలు పాల్గొన్నారు.

ఇద్దరికి జైలు శిక్ష

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 6: పబ్లిక్‌లో అల్లరి చేస్తుండటంతో ఇద్దరిని అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసి న్యాయాధికారి ఎదుట ప్రవేశపెట్టడంతో జైలు విధించినట్లు వన్‌టౌన్ సీఐ వెంకటచలపతి మంగళవారం తెలిపారు. సాదిక్‌నగర్‌కు చెందిన సాదిక్‌హుసేన్, సాజిద్ అనే ఇరువురు యువకులు ఈ నెల 2వ తేది సాయంత్రం గాంధీ చౌక్ సెంటర్‌లో పుట్టిన రోజు వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి గట్టిగా కేకలు వేస్తూ ప్రజలకు, వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తూ మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించారు. దీంతో వన్ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రాంభూపాల్ రెడ్డి ఎదుట హాజరు పరచడంతో యువకులకు ఒక్కొక్కరికి రెండురోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

మద్యం స్వాధీనం

మహానంది, ఫిబ్రవరి 6: సెబ్ పోలీసులు దాడులు మంగళవార దాడులు నిర్వహించి 208 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొన్నట్లు సెబ్ సీఐ విశ్వనాధరెడ్డి తెలిపారు. అబ్బీపురం గ్రామానికి చెందిన వెంకటేశ్వరరెడ్డి నుంచి 28 మద్యం బాటిళ్లు, ఇదే గ్రామం లోని ప్రధాన రహదారి ద్వారా బండి ఆత్మకూరు మండలం బి.కోడూరు గ్రామానికి చెందిన బాలుడు అనే వ్యక్తి అక్రమంగా మద్యం బాటిళ్లు తరలిస్తుండగా గుర్తించి 175 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొన్నట్లు చెప్పారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.ఈ దాడుల్లో సెబ్ పోలీసులు, ఇంటెలిజెన్సీ వింగ్ సంయుక్తంగా పాల్గొన్నట్లు చెప్పారు.

'విద్యుత్ లైను మార్చాలి'



విద్యుత్ డీఈకి వినతి పత్రం అందజేస్తున్న రైతులు

పాణ్యం, ఫిబ్రవరి 6: గోరుకల్లు నుంచి డోన్‌కు తాగునీటిని అందించడంలో భాగంగా చేపట్టిన విద్యుత్ సరఫరాపై పాణ్యం రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేసింది. పాణ్యం విద్యుత్ కార్యాలయంలో మంగళవారం డీఈఈ సతీష్‌కుమార్ రెడ్డిని కలిసి సమస్యల వినతి పత్రాన్ని అందజేశారు. రైతులు మాట్లాడుతూ గోరుకల్లు రిజర్వాయర్ నుంచి డోన్‌కు తాగునీరు అందించే ప్రయత్నంలో సుగాలి మెట్టవద్ద ఏర్పాటు చేసిన నీటి నిల్వ సంపుకు పాణ్యం సబ్ స్టేషన్ నుంచి 1165 కేవీ ఏ లోడుతో 11 కేవీవిద్యుత్ సరఫరా లైనును ఏర్పాటు చేస్తున్నారన్నారు. కాగా సబ్ స్టేషన్ నుంచి జాతీయ రహదారికి నేరుగా తీసుకువెళ్లకుండా జాతీయ రహదారికి కుడివైపుకు మార్చడంతో మామిడి తోటలు, పంటపొలాలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. మామిడి తోటలతో పాటు, రెసిడెన్షియల్ పాఠశాల ఉన్నాయన్నారు. పాణ్యం వద్ద కుడివైపున మార్చిన విద్యుత్ లైను సుగాలిమెట్ట వద్ద మళ్లీ ఎడమవైపుకు మార్చాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. నేరుగా లైను ఏర్పాటు చేయడం వల్ల దాదాపు రెండు కిలోమీటర్లు కొండ ప్రాంతం ఉండడంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు.కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ పుల్లయ్య, టీడీపి నాయకులు రమణమూర్తి, ఖాదర్‌బాష, మహబూబ్‌బాష, వైసీపి నాయకులు మధుసూదన్‌రెడ్డి, గౌడు, విజయానికేతన్ పాఠశాల కరస్పాండెంట్ నాగమల్లీశ్వరరెడ్డి, రైతులు మున్నా, అన్వర్, చౌడయ్య, బాష, మాలమహానాడు నాయకులు దేవదత్తు పాల్గొన్నారు.

మహానందిలో సినీ గేయ రచయిత

మహానంది, ఫిబ్రవరి 6: మహానందిలో మహానందీశ్వరుని సినీ గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్ మంగళవారం కుటుంబ సమేతంగా దర్శనం చేసుకున్నారు. వీరితో పాటు సినీ, రచయిత సాహిత్య ప్రకాశ్ ఉన్నారు.



మహానందిలో సినీ గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్ దంపతులు

ప్రముఖ రంగ స్థల కళాకారుడికి ఘన నివాళి



అల్లాబకాష్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మురసం నేతలు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 6: నంద్యాల ముస్లిం రచయితల సంఘం ఆధ్వర్యంలో భగత్‌సింగ్ గ్రంథాలయంలో ప్రముఖ రంగస్థల కళాకారుడు లొద్దిపల్లె అల్లాబకాష్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అల్లాబకాష్ కళారంగానికి గత ఐదు దశాబ్దాలుగా చేసిన సేవలను కొనియాడారు. న్యాయవాది శంకరయ్య మాట్లాడుతూ ఆంధ్రనాటక కళ సమితిని స్థాపించి నాటకాన్ని ఒక ఉద్యమంగా నడిపిన ఘనత అల్లాబకాష్‌దే అన్నారు. అరసం జిల్లా అధ్యక్షుడు ముర్తుజా, మురసం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రఫీ,మాబుబాషా, కళాకారులు, పాల్గొని పౌరాణిక పద్యాలు పాడి అందరినీ అలరించారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన



తిమ్మాపురంలో మోడల్ స్కూల్‌ను పరిశీలిస్తున్న డీఈవో సుధాకర్‌రెడ్డి

మహానంది,ఫిబ్రవరి 6: మహానంది మండలం తిమ్మాపురం లోని ఏపి మోడల్ స్కూల్ తో పాటు జడ్పీ పాఠశాలను మంగళవారం డీఈవో సుధాకర్‌రెడ్డి పరిశీలించారు. మార్చి 18వ తేది నుండి 30 వరకు జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలు తిమ్మాపురంలోని ఈ రెండు కేంద్రాల్లో జరగనున్నాయి. ఇందులో భాగంగానే పది పరీక్షల నిర్వహణకు ఈ రెండు కేంద్రాలను పరిశీలించినట్లు డీఈవో తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఎంఈవో రామసుబ్బయ్యను ఆదేశించారు. కార్యక్రమంలో మెడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మణరావు, ప్రధానోపాధ్యాయిలు పాల్గొన్నారు.

'దోమల నివారణకు కృషి'

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 6: నంద్యాల పట్టణంలో పేరుకుపోయిన అపరిశుభ్రత, దోమల నివారణపై తన వంతు కృషి చేయనున్నట్లు నంద్యాల జెడ్పీటీసీ గోపవరం గోకుల్ కృష్ణారెడ్డి తెలిపారు. గత మూడు నెలల నుంచి నంద్యాల పట్టణంలోని వార్డుల్లో డ్రైనేజీ కాల్వల్లోని పూడిక తీయకపోవడం, దోమలు విపరీతంగా వృద్ధిచెంది ప్రజలకు ఇబ్బందికరంగా మారినా స్థానిక ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో గోకుల్‌కృష్ణారెడ్డి స్పందించారు. మంగళవారం ఆయన తన స్వంత నిధులతో 10 ఫాగింగ్ మిషన్లు, పది వాహనాలను ఏర్పాటు చేసి పట్టణంలోని వార్డుల్లో దోమల నివారణకు చర్యలు తీసుకున్నారు. గోకుల్ స్పందనపై పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని నెలలుగా కంటిపై కునుకులేకుండా చేస్తున్న దోమల నివారణకు తన స్వంత నిధులతో ఫాగింగ్ మిషన్‌లు ఏర్పాటు చేయడాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారు. కార్యక్రమంలో వినోద్, ఆంజనేయులు, న్యాయవాది అమర్‌నాథ్‌రెడ్డి, దస్తగిరి, కాంతకుమార్, ఉసేన్‌రెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

వేలం పాటలో పెరిగిన ఆదాయం



వేలం పాటలు నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

గడివేముల, ఫిబ్రవరి 6: మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన దుర్గాభోగేశ్వర ఆలయంలో తాత్కాలిక దుకాణాల ఏర్పాటుకు మంగళవారం వేలం పాటలు నిర్వహించగా గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఆదాయం పెరిగిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. పుచ్చకాయలు, చెరుకుల అంగడి, ఐస్, కూల్‌డ్రింక్స్ సప్లయర్స్, డెకరేషన్ షాపు వేలం పాటలు నిర్వహించగా గత ఏడాది రూ.2.7 లక్షలు వేలం పాట పోగా, ఈ ఏడాది రూ.2.33 లక్షలు ఆదాయం వచ్చిందని చెప్పారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ.26 వేలు ఆదాయం పెరిగిందన్నారు. ఆలయ చైర్మన్ సునీల్‌కుమార్ రెడ్డి, ధర్మకర్తలు పరమేశ్వర్‌రెడ్డి, సురేంద్రనాథ్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీ ఉత్సవం

శ్రీశైలం, ఫిబ్రవరి 6: శ్రీశైలం మహాక్షేత్రంలో లోక కల్యాణార్థం మంగళవారం మూలా నక్షత్రాన్ని స్వామి, అమ్మవార్లకు ఊయలసేవ, పల్లకీ ఉత్సవాన్ని దేవస్థానం ఘనంగా నిర్వహించింది. పూజా కార్యక్రమంలో ముందుగా మహా గణపతి స్వామికి పూజలు జరిపిం చారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఊయలలో ఆశీనులను జేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు. అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్ర నామపూజలు, స్వామివారికి సహస్ర నామార్చన పూజలు నిర్వహించి మంగళహారతులను సమర్పించారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో ఆశీనులనుజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఉత్సవం నిర్వహించారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు

శ్రీశైలం మహాక్షేత్రంలో మంగళవారం లోక కల్యాణార్థం ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య (కుమారస్వామి) స్వామికి, నందీశ్వర స్వామికి, బయలు వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో దేశం శాంతిసౌభాగ్యాలతో విరిసిల్లాలని అర్చకస్వాములు సంకల్పం పఠించారు, అనంతరం పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిస్వామికి పూజలు చేశారు. పంచామృతాలతో అభిషేకించి మంగళహారతులు సమర్పించారు.

ఆకట్టుకున్న నిత్యకళారాధన

శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్య కళారాధన కార్యక్రమంలో మంగళవారం హైదరాబాద్‌కు చెందిన మానస స్కూల్ ఆఫ్ డ్యాన్స్ బృందంతో సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో విఘ్నరాజ, లింగాష్టకం, శివస్తోత్రం, భో..శంభో, శంకరా శశిధర, హిమగిరి తనయే తదితర గీతాలకు ప్రణవి, శ్రీవిద్య, లక్ష్మీ కీర్తన, సహస్ర, హిమవర్షిత తదితరులు నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.



పల్లకిలో ఉత్సవమూర్తులు



నృత్యం చేస్తున్న కళాకారులు

'పనికి తగ్గ వేతనం ఇవ్వాలి'



వైద్యాధికారికి వినతిపత్రాన్ని అందజేస్తున్న ఆశా వర్కర్లు

ఆత్మకూరు, ఫిబ్రవరి 6: ఆశావర్కర్లు చేస్తున్న సేవలను గుర్తించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సీఐటీయూ నాయకులు రామ్‌నాయక్, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు భారతి, సుజాత డిమాండ్ చేశారు. మంగళవారం ఆత్మకూరు అర్బన్ హెల్త్, బైర్లూటి, కొట్టాలచెరువు పీహెచ్‌సీ వైద్యులకు వారు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇస్తున్న రూ.10వేల వేతనంతో ప్రతినెల రూ.3వేల వరకు విధినిర్వహణకు ఖర్చు అవుతున్నాయని తెలిపారు. టీఏ, డీఏ చెల్లించకుండా రోజురోజుకు పనిభారం పెంచుతున్నారని వివరించారు. మరణించిన ఆశాలకు ఎక్స్‌గ్రేషియో కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా అనేక విధాలుగా సేవలందిస్తున్న ఆశాలకు రిటైర్డుమెంట్ అనంతరం పెన్షన్ సదుపాయం కల్పించాలని, మెటర్నరీ లీవ్స్ మంజూరు చేయాలని, ప్రతినెల వేతనాలు ఒకటో తేదినే ఇవ్వాలని, ప్రమాద బీమా సదుపాయం కల్పించాలని, ఉద్యోగ భద్రత ఇవ్వాలని, రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నులిపురుగుల నివారణకు 'ఆల్బెండజోల్'

● అడిషనల్ డీఎంహెచ్‌వో శారదాబాయి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌వో, అధికారులు

ఆత్మకూరురూరల్, ఫిబ్రవరి 6: నులి పురుగులను పూర్తిగా నిర్మూలించి, రక్త హీనతను తగ్గించేందుకే ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు అడిషనల్ డీఎంహెచ్‌వో శారదాబాయి తెలిపారు. పట్టణంలోని ఎంపీడీవో సమావేశ భవనంలో మంగళవారం వైద్యాధికారులు గోపాల్, పవన్‌కుమార్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు, ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీఎంహెచ్‌వో పలు సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన నేషనల్ డీవార్మింగ్ డే సందర్భంగా మండలంలోని అన్ని పాఠశాలల్లో 5 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల వరకు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా పంపిణీ చేయాలని సూచించారు. ఈ మాత్రలను తీసుకోవడం ద్వారా నులిపురుగుల నివారణతో పాటు, రక్తహీనతను అధిగమించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకే ప్రభుత్వం ఈ ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేస్తోందన్నారు. అలాగే లెప్రసీ పక్షోత్సవాల సందర్భంగా ఆశాలు ఇంటింటికి వెళ్లి కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి లెప్రసి సర్వేను వేగవంతం చేసి ఈనెల 13 లోగా పూర్తి చేయాలన్నారు. ఆశాలు గర్భిణులను ఎప్పటికపుడు పర్యవేక్షిస్తూ వారికి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని, బాలింతల సంరక్షణ, రక్త హీనత ఉన్న గర్భిణుల వివరాలు, హైరిస్క్ ఉన్న వారి వివరాలను ఎప్పటికపుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఎంఈవో జానకి రామ్, ఏవో మోహన్‌కుమార్, సీహెచ్‌వో ఖుద్దూస్‌బాషా, అంగన్‌వాడీలు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

'వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి'

ఆత్మకూరురూరల్, ఫిబ్రవరి 6: మండలంలో ఆరోగ్య సురక్ష పేరిట వైద్యాధికారుల ఆధ్వర్యంలో నిర్వహించే వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు గోపాల్‌నాయక్, ప్రసన్నలక్ష్మి, నజీర్ సూచించారు. మండలంలోని వడ్లరామాపురం గ్రామంలో మంగళవారం వైద్యాధికారుల ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్ష క్యాంపును నిర్వహించారు. అనంతరం వైద్యాధికారుల పర్యవేక్షణలో రోగులకు బీపీ, షుగర్, ఈసీజీ, మలేరియా, డెంగ్యూ, గళ్ల తదితర పరీక్షలు నిర్వహించారు. చిరువ్యాధులు కలిగిన వారిని పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. రోగులలో ఆపరేషన్‌లు అవసరమైన వారిని గుర్తించి ఆరోగ్యశ్రీ కింద వారిని పలు ఆసుపత్రులకు రెఫర్ చేశారు.అలాగే పలువురికి కంటి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ అవసరమయిన 7 గురిని కర్నూలు వైద్యశాలకు సిఫారసు చేశారు. కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి బాలునాయక్, సూపర్‌వైజర్లు మాలిక్‌బాషా, సరోజ, వైద్య సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సాంకేతిక లోపంతో నిలిచిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ

● లబ్ధిదారుల అవస్థలు



రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీవో దాసు

కొత్తపల్లి, ఫిబ్రవరి 6: కొత్తపల్లి మండలంలోని ఆయా గ్రామాల సచివాలయాల్లో జగనన్న ఇళ్ల పట్టాల ప్రక్రియ మూడు రోజుల క్రితం ప్రారంభమైంది. అయితే సాంకేతిక కారణాల వల్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తిగా నిలిచిపోవడంతో ఆయా గ్రామాల లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం ఆత్మకూరు ఆర్డీవో దాసు కొత్తపల్లి గ్రామ సచివాలయాన్ని సందర్శించి అందుకు గల కారణాలను స్థానిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్డీవో దాసు మాట్లాడుతూ మండలంలో 708 మంది జగనన్న ఇళ్లు ఉన్నాయనీ, వీటికి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభంలోనే సాంకేతిక లోపం కారణం వల్ల సర్వర్లు మొరాయిస్తున్నాయని అన్నారు. అంతేగాకుండా ఈ మండలంలో ఒక్క గ్రామంపై రిజిస్ట్రేషన్ చేయిస్తుంటే మరో గ్రామం ఆన్‌లైన్‌లో చూపిస్తోందన్నారు. అనంతరం ఆర్డీవో దాసు ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ తిరుపతయ్య, డీటీ పెద్దన్నతో కలిసి పరిశీలించారు. అనంతరం వారికి సూచనలు ఇచ్చారు.

'పరీక్షల భయం వీడాలి'

ఆత్మకూరు, ఫిబ్రవరి 6: పది పబ్లిక్ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు పరీక్షలపై భయం వీడాలని ఆదిత్యా కళాశాల కరస్పాండెంట్ విజయభాస్కర్ నాయుడు థెరిసా జూనియర్ కళాశాల అకడమిక్ డైరెక్టర్ సాయిప్రణీత్, ఎస్ఎఫ్ఐ నాయకులు దినేష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆత్మకూరు ఆయా కళాశాలల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పది విద్యార్థులకు ప్రజ్ఞా వికాస పరీక్షలను నిర్వహించారు. వారు మాట్లాడుతూ పది పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లోనవ్వకుండా నిర్దేశించిన పరీక్షా సమయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రణాళికాతో చదివితే మంచి మార్కులు సాధించవచ్చన్నారు. పరీక్షల ముందు విలువైన సమయాన్ని వృథా చేయకుండా విద్యార్థులు ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రేమ్‌కుమార్, సాయి, సలీం, రవి, వెంకటేష్, దిలీప్, లింగేష్ తదితరులు ఉన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం, ఫిబ్రవరి 6: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి మంగళవారం పశ్చిమగోదావరికి చెందిన కంచర్ల సత్యనారాయణ అనే భక్తుడు రూ. 1,01,116ల విరాళాన్ని పర్యవేక్షకులు హిమబిందుకు అందజేశారు. దాతకు దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

ఎన్నికల విధులపై అవగాహన


మాట్లాడుతున్న నంద్యాల ఆర్డీవో మల్లికార్జునరెడ్డి

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 6: వచ్చే ఎన్నికల్లో సెక్టోరల్ అధికారులు నిర్వహించాల్సిన విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించామని నంద్యాల ఆర్డీవో, ఆళ్లగడ్డ అసెంబ్లీ ఎన్నికల అధికారి మల్లికార్జునరెడ్డి చెప్పారు. ఆళ్లగడ్డ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సెక్టోరల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికల కమిషన్ సూచించిన విధులు, బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలని సూచించామన్నారు. ఆళ్లగడ్డ అసెంబ్లీలోని పోలింగ్ స్టేషన్లు, ఓటర్ల సంఖ్య తదితర వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆరు మండలాలకు కొత్తగా నియమితులైన తహసీల్దార్లు, ఈవోలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, టీడీపీ కౌన్సిలర్ హుసేన్ బాషా, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

రుద్రవరంలో వెదురు వేలం

రూ.9.95 లక్షలు ఆదాయం


వేలం వేస్తున్న అధికారులు

రుద్రవరం, ఫిబ్రవరి 6: రుద్రవరం కలప డిపోలో నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ ప్రాజెక్టు చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు ఆఫీసర్ బీఎస్ఎన్ మూర్తి, జిల్లా అటవీ అధికారి అనురాగ్ మీనా మంగళవారం వెదురు వేలం నిర్వహించారు. రెండో తరగతి 13500, మూడో తరగతి 27వేలు మొత్తం 40500 వెదుర్లు వేలం వేశారు. వెదురు వేలంలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. ప్రభుత్వానికి రూ.9,95,400 ఆదాయం వచ్చిందని వారు చెప్పారు.

డాగ్ పరిశీలన: రుద్రవరంలో స్క్వాడ్ డాగ్(శునకం)ను, వాటి పని తీరును వారు పరిశీలించారు. ఈ డాగ్‌ను స్మగ్లర్లను గుర్తించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో చెలిమ రేంజర్ ఈశ్వరయ్య, డిప్యూటీ రేంజర్ ముర్తుజావలి, సెక్షన్ ఆఫీసర్లు నాగరాజు, శ్రీనివాసరెడ్డి, బీట్ ఆఫీసర్లు ఖాన్, నాగేంద్ర గౌడ్ తదితరులు ఉన్నారు.

శతాధిక వృద్ధుడి మృతి


మహ్మద్ హుశేన్(ఫైల్)

బేతంచెర్ల, ఫిబ్రవరి 6: పట్టణంలోని బైటిపేట కాలనీకి చెందిన మహ్మద్ హుశేన్(104) అనే శతాధిక వృద్ధుడు మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మహ్మద్ హుశేన్ వృత్తిరీత్యా వ్యవసాయదారుడని, చివరి దాకా తన పని తాను చేసుకొనేవాడని, నిత్యం నమాజుకు కూడా హాజరవుతుండేవాడని కుటుంబసభ్యులు, పరిచయస్తులు తెలిపారు. మహమ్మద్ హుసేన్‌కు ఇద్దరు కుమారులు, ఐదుగురు కూతుళ్లు సంతానం ఉన్నారు. మనమళ్లు, మనవరాళ్లు 23 మంది ఉన్నారని కుటుంబ సభ్యులు తెలిపారు.

పలుకూరులో చోరీ

బనగానపల్లె, ఫిబ్రవరి 6: నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలుకూరులో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన లక్ష్మీదేవి అనే మహిళ ఇంటికి తాళం వేసి కూలి పనులకు మంగళవారం వెళ్లింది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలో చొరబడి రూ.35వేలు నగదు, 10 తులాల బంగారం దొంగిలించినట్లు బాధిత మహిళ పేర్కొంది. కూలీ పనికి పోయి ఇంటికి వచ్చే సరికి బీరువా పగులకొట్టి బంగారం, నగదు చోరీ చేసినట్లు బాధిత మహిళ నందివర్గం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి

ఉయ్యాలవాడ, ఫిబ్రవరి 6: మండలంలోని హరివరం గ్రామానికి చెందిన ఎరగుడి మాదార్‌వలిపై అదే గ్రామానికి చెందిన కమ్మ వెంకట సుబ్బయ్య ఇనుపరాడ్డుతో కొట్టి గాయపరిచిన విషయంలో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం 8గంటల ప్రాంతంలో ఇరువురి మధ్య డబ్బు చెల్లింపు విషయంలో గొడవ జరిగింది. ఇనుపరాడ్డు తీసుకుని వెంకటసుబ్బయ్య, అతని కుమారుడు దాడి చేసినట్లు మాదార్‌వలి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం స్వాధీనం: మండలంలోని ఆర్.పాంపల్లె గ్రామానికి చెందిన గంటా సహదేవుడు అనే వ్యక్తి అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో అక్కడకి వెళ్లి తనిఖీలు చేశారు. అతని వద్ద 15 మద్యం బాటళ్లు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ అన్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న విద్యుత్ ఏఈ రామ్మోహన్

దొర్నిపాడు, ఫిబ్రవరి 6: మండలంలోని దొర్నిపాడు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీడీవో వెంకట సుబ్బారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి సునీత, హౌసింగ్ ఏఈ బ్రహ్మం, ఎంఈవో రామచంద్రయ్య మాట్లాడారు. అయితే ఎంఈవో మాట్లాడుతుండగా జడ్పీటీసీ శకుంతలారెడ్డి కల్పించుకొని మధ్యాహ్న భోజనం సరిగా లేదన్నారు. ఎంఈవో స్పందిస్తూ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన అందేలా చూస్తామన్నారు. వంట ఏజెన్సీ నిర్వాహకులకు నోటీసులు అందజేస్తామని చెప్పారు. అలాగే విద్యుత్ ఏఈ రామ్మోహన్, ఈవోపీఆర్డీ శ్రీనివాసులు మాటాడారు. అనంతరం వెలుగు ఏపీఎం బాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ, వైద్యులు నాగేంద్ర, పీఆర్ ఏఈ కొండారెడ్డి, పశువైద్యాధికారి పుల్లయ్య, హాస్టల్ వార్డెన్ రాముడు తదితరులు ఆయాశాఖలపై ప్రసంగించారు. సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, తహసీల్దార్ నాగరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

మద్దిలేటి స్వామికి బంగారు సమర్పణ

బేతంచెర్ల, ఫిబ్రవరి 6: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి నరసింహ స్వామివారికి 100 గ్రాముల బంగారాన్ని కర్నూలు నగరం శేషాద్రినగర్‌కు చెందిన కొడితల పెద్ద లక్ష్మయ్య కుమారుడు కోడితల శ్రీనివాసులు సమర్పించారని ఈవో పాండురం గారెడ్డి, చైర్మన్ సీతారామచంద్రుడు మంగళవారం తెలిపారు. భక్తుడికి తీర్థప్రసాదాలు అందజేశారు. ధర్మకర్త లక్ష్మీనాయుడు, వెంగళ్ రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

అహోబిలేశుడికి పూజలు

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 6: ఆళ్లగడ్డ పట్టణంలోని పలు వీధుల్లో 22వ రోజు మంగళవారం అహోబిలేశుడు పూజలు అందుకున్నారు. ఈడిగ బాలయ్య తెలుపు, జేఆర్ ఆంజనేయులు, సుబ్బారావు-లక్ష్మణరావు, కొండాలక్ష్మయ్య, కొత్తూరి సుబ్బయ్య, చాటకొండ ఓబులేసు, చాటకొండ రామయ్య, తొటంశెట్టి వెంకటస్వామి తెలుపుల వద్ద విడిది చేశారు. ఉత్సవ పల్లకీలోని ప్రహ్లాద వరదస్వామి, జ్వాలా నరసింహస్వామి పూజలందుకున్నారు.

తిరుమలకు పాదయాత్ర

చాగలమర్రి, ఫిబ్రవరి 6: వేంకటేశ్వరస్వామి మాల ధరించిన ఐదుగురు భక్తులు మంగళవారం చాగల మర్రి నుంచి పాదయాత్ర చేపట్టారు. లోక కల్యాణార్థం ప్రజలు సుభిక్షంగా ఉం డాలని కోరుతూ తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. తిరుమలలోని వేంకటేశ్వరస్వామిని దర్శించుకొని పాదయాత్ర ముగింప చేస్తామని భక్తులు తెలిపారు.

ఓటరు చూపంతా టీడీపీ వైపే

» మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

రుద్రవరం, ఫిబ్రవరి 6: రాష్ట్రంలో ఓటరు చూపు టీడీపీ వైపు ఉందని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. మంగళవారం సాయంత్రం రుద్రవరంలో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ సమక్షంలో బోసామణి, రాజ్‌కుమార్, చంటి, విక్రం, ఆనంద్, వినోద్, క్రిష్ణ, మోసా, అభిషేకం, ప్రియాంక, శ్రీలక్ష్మి, పల్లవి, పుష్పలత మరో 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. మాజీ మంత్రి అఖిలప్రియ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ నాయకులు అరాచకాలను ఎదుర్కొంటూ టీడీపీపై ఉన్న నమ్మకంతో నాయకులు కార్యకర్తలు టీడీపీలో చేరుతున్నారన్నారు. టీడీపీలో చేరిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామన్నారు. ఎవరూ అధైర్యపడొద్దని సూచించారు. వైసీపీ పాలనలో ప్రజలు విసుగెత్తి చరమ గీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ పాలనలో నిరుపేదలు సమస్యలతోనే కొట్టుమిట్టాడుతున్నారన్నారు. కుళాయిలు, తాగునీటి సమస్య ఇళ్లస్థలాలు లేక నిరుపేదలు ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఆలమూరు నారాయణ, రంగనాయకులు, పోలా గురుమూర్తి, ఎస్సీ సెల్ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కొమ్మలపాటి రాజారావు, చంద్ర, శ్రీను, ఐటీడీపీ ఇన్‌చార్జి గురప్ప తదితరులు ఉన్నారు.

వచ్చేది టీడీపీ ప్రభుత్వమే: రాష్ట్రంలో రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని మాజీమంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. మంగళవారం రుద్రవరంలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ తిరిగి మేనిఫెస్టో పత్రాలు పంపిణీ చేశారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే ప్రజా సమస్యలు అన్నీ పరిష్కరిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ సైకిలు గుర్తుకు ఓటు వేసి టీడీపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఏపీకి కాబోయే సీఎంచంద్రబాబునాయుడే అన్నారు.


భూమా అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరిన కార్యకర్తలు

ప్రజల నడ్డి విరుస్తున్న వైసీపీ ప్రభుత్వం

» టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్, ఫిబ్రవరి 6: వైసీపీ ప్రభుత్వం ఇష్టారాజ్యంగా నిత్యావసర ధరలు పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నదని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని పాతపేటలో టీడీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ నవరత్నాల పేరుతో నవ మోసాలు చేసి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని ధ్వజమెత్తారు. నిత్యం అబద్ధాలు చెబుతూ రాష్ట్ర ప్రజల భవిష్యత్తును అంధకారం చేశారన్నారు. వైసీపీ అరాచకాలతో ప్రజలు విసిగిపోయారన్నారు. టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని, రాబోయే ఎన్నికల్లో డోన్ నియోజకవర్గంలో టీడీపీని గెలిపించుకుని చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకుందామని సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు సీఎం శ్రీనివాసులు, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, అభిరెడ్డిపల్లె గోవిందు, ఆలా మల్లికార్జున రెడ్డి, ఎస్ఎండీ రఫి, మర్రి ఉపేంద్ర, చక్రపాణిగౌడు, ఎల్ఐసీ శ్రీరాములు, హుశేన్‌పీరా, ప్రభాకర్, ప్రసాద్, సిటీ కేబుల్ కిరణ్ పాల్గొన్నారు.


చాగలమర్రిలో..


డోన్‌లో టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తున్న సుబ్బారెడ్డి

చాగలమర్రి: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు అన్నారు. మంగళవారం చాగలమర్రి గ్రామంలోని గాంధీ బజార్‌లో టీడీపీ నాయకులతో కలిసి బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ సూపర్-6 పథకాల గురించి ప్రజలకు వివరించారు. వైసీపీ అరాచక పాలనకు చరమగీతం తప్పదని అన్నారు. నిరుద్యోగులను జాబ్ క్యాలెండర్ పేరుతో దగా చేశారని అన్నారు. వైసీపీ పాలనలో అక్రమ కేసులు, దాడులు అధికమయ్యాయని అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధన కోసం ఉద్యమం


ర్యాలీ నిర్వహిస్తున్న ఏపీ ఎన్‌జీవో సంఘం నాయకులు

బనగానపల్లె, ఫిబ్రవరి 6: ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షన్‌దారుల న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం దశల వారిగా ఉద్యమం చేపడుతున్నట్లు ఏపీ ఎన్‌జీవో సంఘం బనగానపల్లె అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఎన్జీవో సంఘం నాయకులు తమ డిమాండ్ల సాధన కోసం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఐఆర్, సరెండర్ లీవ్స్, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐసీ క్లైమ్స్, డీఏ, అరియర్స్, పీఆర్సీ అరియర్స్, మెడికల రిటైర్మెంట్ బెనిఫిట్స్, మెడికల్ క్లియరెన్సు బిల్లుల ఇచ్చే వరకు దశల వారీ పోరాటం సాగిస్తామన్నారు. ఈనెల 11న జరిగే రాష్ట్ర జెఏసీ లో అన్ని భాగస్వామ్య సంఘాల ఏకాభిప్రాయంతో డిమాండ్ల సాధన కోసం 12న చీఫ్ సెక్రటరీకి నోటీసులు ఇవ్వనున్నట్లు తెలిపారు. 13 తర్వాత ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఉద్యమం చేయనున్నట్లు తెలిపారు.

8న విజయవాడలో ధర్నా

బేతంచెర్ల, ఫిబ్రవరి 6: ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 8వ తేదీ గురువారం విజయవాడలో జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి రహంతుల్లా, ఆశా వర్కర్స్ యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకటలక్ష్మి మండలంలోని ఆశా వర్కర్లకు పిలుపునిచ్చారు. మంగళవారం బేతంచెర్ల మండలం, ఆర్ఎస్ రంగాపురం గ్రామంలోని పీహెచ్‌సీలోకి ఆశా వర్కర్లు బృందంగా వెళ్లి డా. సలీమ్‌కు పలు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నిత్యం ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరారు. పనిభారం తగ్గించాలని, ప్రభుత్వ సెలవులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. విజయవాడలోని ధర్నాచౌకు వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంజనమ్మ, పుష్పావతి, రమాదేవి, లక్ష్మీదేవి, నాగమ్మలతో పాటు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పండ్లతో చాక్లెట్ల తయారీపై శిక్షణ

డోన్, ఫిబ్రవరి 6: పట్టణంలోని బుగ్గన శేషారెడ్డి స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంలో వైఎస్సార్ హార్టీకల్చర్ యూనివర్సిటీ బోర్డు సభ్యురాలు సప్తశైల సుమిత్ర ఆధ్వర్యంలో మంగళవారం పండ్లతో చాక్లెట్ల తయారీపై మహిళలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సప్తశైల సుమిత్ర మాట్లాడుతూ నిరుద్యోగ యువతులకు ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు ఈ శిక్షణ ఇస్తున్నామని అన్నారు. వివిధ రకాల పండ్లతో చాక్లెట్లను తయారు చేసే విధానంపై మెళకువలు నేర్పించామని అన్నారు. కార్యక్రమంలో డా. విజయశ్రీ, కౌన్సిలర్ విమల, ఇన్నర్‌విల్ క్లబ్ అధ్యక్షురాలు షాలిని, రాజా సుజాత, శైలజ, శారద, మద్దమ్మ, శకుంతల పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

బేతంచెర్ల, ఫిబ్రవరి 6: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, కమిషనర్ రమేష్‌బాబులు సూచించారు. మంగళవారం నగర పంచాయతీ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకు హ్యాండ్ వాష్ స్టేషనరీని సీఎంఎం శ్రీదేవితో కలిసి వారు ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

దివ్యాంగుల చట్టాన్ని అమలు చేయాలి

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 6: దివ్యాంగుల చట్టాన్ని అమలు చేయాలని జిల్లా వికలాంగుల సంఘం ఉపాధ్యక్షుడు అందెనం దేవరాజు కోవెలకుంట్ల సీఐ జయచంద్రకు వినతిపత్రం మంగళవారం అందించారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా వికలాంగులను ఉద్దేశ పూర్వకంగా హేళన చేసినా కించపరిచేలా మాట్లాడినా వారిపై చర్యలు తీసుకోవాలని సీఐని కోరారు.

'పంట నమోదు తప్పనిసరి'

చాగలమర్రి, ఫిబ్రవరి 6: గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలకు ఈక్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో రంగనేతాజీ సూచించారు. మండలంలోని గొడిగనూరు గ్రామంలో మంగళవారం రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను, ఎరువుల స్టాక్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 17 ఆర్‌బీకే పరిధిలో 90 శాతం ఈక్రాప్ నమోదు చేయడం జరిగిందని అన్నారు. ఈక్రాప్ నమోదు చేసుకున్న రైతులు ఈనెల 15వ తేదీ లోపు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

డోన్(రూరల్), ఫిబ్రవరి 6: రోడ్డు భద్రత నియమాలు పాటించాలని డోన్ ఆర్టీవో క్రాంతి కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రితో పాటు పలు ప్రైవేటు ఆసుపత్రులలో జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీవో క్రాంతి కుమార్ రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని ప్రభుత్వ ఆసుపత్రులకు, ప్రైవేటు ఆసుపత్రులకు తరలించే వ్యక్తులకు చట్టపరంగా ఎటువంటి సమస్యలు ఉండవన్నారు. ప్రమాదాల్లో గాయపడి ఆపదలో ఉన్న వారిని గుర్తించి సకాలంలో వైద్యసేవలు అందేలా కృషి చేసేవారికి ప్రోత్సాహక బహుమతులను కూడా ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో డోన్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ హనీఫ్‌తో పాటు వివిధ ఆసుపత్రుల సిబ్బంది పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: కొలిమిగుండ్ల మండలం తుమ్మల పెంట గ్రామ పరిధిలో ఉన్న అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ యజమాన్యం పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలు రోడ్డు ప్రమాదాల నివారణ జాగ్రత్తలపై కళా జాతా కార్యక్రమాలు నిర్వహించారు. కొలిమిగుండ్ల మండలంలోని పెట్టికోట, అంకిరెడ్డిపల్లె, గొర్విమానుపల్లె, కొలిమిగుండ్ల గ్రామాలలో ఫిబ్రవరి 1వతేదీ నుంచి ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాలు మంగళవారం ముగిశాయి.


అవగాహన కల్పిస్తున్న ఆర్టీవో క్రాంతి కుమార్


అంకిరెడ్డి పల్లెలో విద్యార్థులకు అవహగాహన కల్పిస్తున్న కళాకారులు

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ప్యాపిలి, ఫిబ్రవరి 6: తాగునీటి సమస్యను పరిష్కరించాలని మండలంలోని పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మంగళవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తమ గ్రామాల్లో గత రెండు నెలలుగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని భోంచెర్వుపల్లి ఎంపీటీసీ శేఖర్, ఏనుగమర్రి, పోతుదొడ్డి సర్పంచులు మోహన్, సుబ్బరాయుడు సభ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన ఎంపీడీవో సాయి మనోహర్ వివిధ గ్రామాల్లో తక్షణమే నీటి సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం బదిలీపై వెళ్లిన ఎంపీడీవో ఫజుల్ రహిమాన్‌ను అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ గోకుల్ లక్ష్మి, జడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, దిలీప్‌చక్రవర్తి, మెట్టు వెంకటేశ్వరరెడ్డి, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

52 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

చాగలమర్రి, ఫిబ్రవరి 6: మండలంలో సాధారణ ఎన్నికల సందర్భంగా 52 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ రమణమ్మ తెలిపారు. మంగళవారం చాగలమర్రి తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ విజయ్‌కుమార్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం కోసం పోస్టు కార్డు ఉద్యమం

బనగానపల్లె, ఫిబ్రవరి 6: బనగానపల్లె పట్టణంలోని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ప్రతాప్ ఆధ్వర్యంలో పాత పెన్షన్ సాధన కోసం పోస్టు కార్డు ఉద్యమాన్ని యూటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించారు. జిల్లా సహాధ్యక్షుడు సత్యప్రకాశ్ మాట్లాడుతూ ఓట్ ఫర్ ఓపీఎఫ్ కార్యక్రమంలో భాగంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్ల అందరూ పాత పెన్షన్ సాధించడానికి ఏప్రిల్‌లో జరుగబోయే ఎన్నికల్లో ఎవరైతే ఓపీఎస్‌ను ఎన్నికల మ్యానిఫెస్టోలో పెడతారో వారికి ఓటు వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ దినాన్ని విజయవంతం చేయాలి

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 6: జాతీయ నులిపురుగుల నివారణ దినాన్ని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ నెల 9వ తేదీన విజయవంతం చేయాలని జిల్లా ఫ్యామిలీ నోడల్ అధికారి జగదీశ్ చంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం కోవెలకుంట్ల మండలపరిధి లోని రేవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫ్యామిలీ నోడల్ అధికారి జగదీశ్ చంద్రా రెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు ఆల్బెన్‌డొజోల్ మాత్రలు పంపిణీ చేయాలని తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్టు

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 6: కోవెలకుంట్ల పట్టణంలోని ఎల్ఎం కాంపౌండ్‌లో మద్యం బాటిళ్లు విక్రయిస్తున్న అచ్చమ్మను అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి 10 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. మంగళవారం కోవెలకుంట్ల పట్టణంలో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో తమ సిబ్బందితో కలసి దాడి చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని అచ్చమ్మను అదుపులోకి తీసుకొని ఆమె వద్ద 10 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భగవద్గీత ప్రతుల పంపిణీ

ప్యాపిలి, ఫిబ్రవరి 6: మండలంలోని మామిళ్లపల్లి, రాంపురం, జక్కసానికుంట్ల, రాచవాండ్లపల్లి గ్రామాల్లో మంగళవారం త్రైత్రసిద్ధాంత ప్రబోధానంద సేవా సమితి ఆధ్వర్యంలో భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు.

ప్రభుత్వం మొండివైఖరి వీడనాడాలి



మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

డోన్(రూరల్), ఫిబ్రవరి 6: ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ తన మొండి వైఖరిని వీడనాడాలని ఏపీ ఎన్జీవోస్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి ఏపీఎన్జీవోస్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు పరచాలని జేఏసీ చైర్మన్ సమీవుల్లా, నాయకులు ప్రేమ్ కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీ కమిషన్ వేసి ఆరు నెలలు గడిచినా ఇంత వరకు ఐఆర్ ప్రకటించలేదన్నారు. డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు కేఎన్ భానుసింగ్, ఎంఎస్ బాబు, రమణ, రంగారెడ్డి, ఆర్టీసీ రాముడు తదితరులు పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలి


కరపత్రాలను విడుదల చేస్తున్న యూనియన్ నాయకులు

బేతంచెర్ల, ఫిబ్రవరి 6: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రైవర్లను జైలు పాల్జేసే హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 16న తలపెట్టే దేశ వ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలని బేతంచెర్ల ట్రాన్స్‌పోర్టు రంగం రాష్ట్ర కమిటీ సభ్యుడు వైబీ. వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ఎల్లయ్య బేతంచెర్ల లారీ స్టాండ్‌లో కరపత్రాలు మంగళవారం విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం గత డిసెంబరు 21న భారత న్యాయ సంహిత పేరుతో కొత్త చట్టాన్ని పార్లమెంటులో ఆమోదింపజేసుకొని రాష్ట్రపతి ఆమోదం పొంది సెక్షన్ 106/1 ప్రకారం ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌కు 10 సం వత్సరాల జైలు శిక్ష, రూ.5 లక్షల జరిమానా కట్టాలని 106/2 ప్రకారం ప్రమాదం చేసిన డ్రైవరు అక్కడి నుంచి వెళ్లినట్లయితే.. హిట్ రన్ పేరుతో పదేళ్ల జైలు శిక్ష రూ.10లక్షలు జరిమానా విధించేలా చట్టాన్ని రూపొందించారన్నారు. ఈచట్టం వల్ల డ్రైవర్లు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయ కులు జై. శ్రీనివాసులు, రామాంజనేయులు, రమణారెడ్డి, సురేష్, రాజు, ఎస్ఏ కలాం, మధు, శ్రీనివాసరెడ్డి, వెంకటేష్ నాయక్, ఎర్రన్న నాయక్ మద్దిలేటి స్వామి, తిరుమలేసు పాల్గొన్నారు.

అక్రమ రవాణాకు చెక్

రెండు వాహనాలు సీజ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రుద్రవరం, ఫిబ్రవరి 6: నల్లమల తీరంలో ఎదురు లేని వెదురు రవాణా అనే శీర్షిక ఆంధ్రజ్యోతిలో ఈ నెల 4న ప్రచురితమైంది. నంద్యాల జిల్లా ఫారెస్టు అధికారి అనురాగ్ మీనా స్పందించారు. నంద్యాల డివిజన్‌లో అక్రమ రవాణాకు చెక్ పెట్టామని అన్నారు. రెండు వాహనాలు సీజ్ చేశామన్నారు. పెద్దపులుల సంఖ్య పెరగడంతో బయటికి వచ్చి అడవి లోపలికి వెళ్తుంటాయన్నారు. లంకమల అడవుల వరకూ ప్రొద్దుటూరు ప్రాంతాల్లో పెద్దపులుల సంచారం ఉందన్నారు. నల్లమలలో పెద్దపులుల సంఖ్య పెరగడంతో సంచారం కూడా అధికంగా ఉందన్నారు. స్మగ్లర్ల నుంచి అటవిని రక్షిస్తామని అన్నారు. ఎర్రచందనం స్మగ్లింగ్, వన్యప్రాణులపై వేట అరికట్టామన్నారు. ఇకపై అక్రమ రవాణాను పూర్తిగా అరికడతామని తెలిపారు.

సెబ్ సీఐగా జయనాథరెడ్డి

డోన్(రూరల్), ఫిబ్రవరి 6: డోన్ సెబ్ సీఐగా జయనాథరెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లా రాయచూరు నుంచి బదిలీపై డోన్ సెబ్ సీఐగా వచ్చిన జయనాథరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు సెబ్ సీఐగా పని చేస్తున్న భీమలింగ బదిలీ కావడంతో ఆయన స్థానంలో జయనాథరెడ్డి బాధ్యతలు చేపట్టారు.

విద్యుత్ సబ్ స్టేషన్ల పరిశీలన

రుద్రవరం, ఫిబ్రవరి 6: ఆళ్లగడ్డ విద్యుత్ సబ్ డివిజన్‌లో మంగళవారం ఏపీఈఆర్, ఏపీఎస్పీడీసీఎల్ కోఆర్డినేటరు మునిశంకర్ సబ్ స్టేషన్లను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. రుద్రవరం, యల్లావత్తుల, చిన్నకంబలూరు, హరినగరం, చిత్రరేణిపల్లె, ఆలమూరు సబ్ స్టేషన్లను పరిశీలించారు. ఎందుకు ఇక్కడ విద్యుత్ ఖర్చవుతుందని వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈ రవికాంత్ చౌదరి, ఏఈ రాఘవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

చాగలమర్రి, ఫిబ్రవరి 6: మండలంలోని జ్ఞానాపురం, చిన్నవంగలి గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో అనూరాధ మంగళవారం తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల గ్రేడింగ్‌ను పరిశీలించారు. విద్యార్థుల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. హెచ్ఎంలు సుబ్బారెడ్డి, మస్తాన్‌వలి, సీఆర్పీ ఖాశీం ఉన్నారు.

11:30 గంటలైనా తెరచుకోని ఎమ్మార్సీ భవనం

ఉయ్యాలవాడ, ఫిబ్రవరి 6: ఉయ్యాలవాడలోని ఎమ్మార్సీ కార్యాలయం మంగవారం ఉదయం 11.30 గంటలు అయినా తెరచుకోలేదు. ఎమ్మార్సీలో మండల విద్యాధికారితోపాటు ముగ్గురు సీఆర్పీలు, ఇద్దరు ఐఈఆర్టీ ఉపాధ్యాయులు ఉన్నారు. 11.30 గంటలు అయినా కార్యాలయం తెరచుకోకపోవటంతో ఆయా పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు, ఉపాధ్యాయులు వెనుదిరిగి వెళ్లిపోయాయి. 11.30 గంటలు దాటిన తరువాత సీఆర్పీ లక్ష్మీదేవి వచ్చిన కార్యాలయం తలుపులు తెరిచారు. ఎంఈవో ప్రతాప్‌రెడ్డిని వివరణ కోరగా ఎలక్షన్ విధులపై జిల్లా కేంద్రానికి వెళ్లినట్లు తెలిపారు. సిబ్బంది ఆలస్యంగా రావడంపై విచా రిస్తామని చెప్పారు.


తలుపులు తెరచుకోని ఎమ్మార్సీ భవనం